కాంగ్రెస్ సీనియర్ నాయకుడు

ఎర్రమల్లపై కేసు నమోదు

జనగామ చౌరస్తా, డిసెంబర్ 18: జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్‌పై ఆ పార్టీ మహిళా కార్యకర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇటీవల నిర్వహించిన పార్టీ సమీక్ష సమావేశంలో సుధాకర్ సదరు మహిళ భుజంపై చెయ్యివేసి బలవంతంగా బయటకి గెంటివేసినట్టు సమాచారం. దీనిపై ఆమె అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో 354, 294(బీ) సెక్షన్ల కింద సుధాకర్‌పై ఆదివారం కేసు నమోదు చేసినట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 10 రోజులు కాకుండానే ఆ పార్టీ నాయకుడిపై మహిళా కార్యకర్త పోలీసులకు ఫిర్యాదు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



సోమవారం బేగంపేట విమానాశ్రయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క. చిత్రంలో గవర్నర్ తమిళి సై, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క

రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు నమస్కరిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి. చిత్రంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

శీతాకాల విడిదికి రాష్ట్రపతి

- ఘన స్వాగతం పలికిన గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం
- నేడు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ సందర్శన

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు విచ్చేశారు. సోమవారం రాత్రి 7 గంటలకు రాష్ట్రపతి ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. రాష్ట్రపతికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ధనసరి అనసూయ, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, ఇతర ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం బేగంపేట నుంచి నేరుగా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి చేరుకున్నారు. ఐదు రోజులపాటు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ద్రౌపది ముర్ము బస చేయనున్నారు. ఇందుకోసం అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. మంగళవారం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌ను రాష్ట్రపతి సందర్శించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బొల్లారం నుంచి బేగంపేట రూట్‌లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసులు సూచించారు.

దానకిశోర్ బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శిగా దాన కిశోర్ సోమవారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం హెచ్‌ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. ఆయనకు ఎంఏయుడీ, హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు.

విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా 'బుర్రా' బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సచివాలయంలోని తన కార్యాలయంలో బుర్రా వెంకటేశంను ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీ మోహన్‌రెడ్డి, పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీ రాజభాను చంద్రప్రకాశ్, ప్రధానకార్యదర్శి ఆర్ రాజుగారెడ్డి, కోశాధికారి బీ తుకారంలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాల నేపథ్యం నుంచి వచ్చిన తనకు విద్యాశాఖలో పనిచేయడం ఆనందంగా ఉన్నదని బుర్రా వెంకటేశం చెప్పారు. తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

కమిషనర్‌గా శ్రీదేవి బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న వాణిజ్య పన్నుల శాఖ (కమర్షియల్ ట్యాక్స్) కార్యాలయంలో ఆ శాఖ కమిషనర్‌గా టీకే శ్రీదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీదేవికి కొద్ది రోజులు కమర్షియల్ ట్యాక్స్ కమిషనర్‌గా పనిచేసిన అనుభవం ఉన్నది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అప్పుడు ఎన్నికల సంఘం చేపట్టిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా శ్రీదేవిని కూడా బదిలీ చేశారు. రెండు నెలల్లోనే శ్రీదేవిని మళ్లీ అదే శాఖ కమిషనర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు స్వీకరించిన శ్రీదేవికి తెలంగాణ కమర్షియల్ ట్యాక్స్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీసీటీజీవోఏ) అధ్యక్షుడు వీ శ్రీనివాసరెడ్డితోపాటు కార్యాలయ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

దేవసేనకు ఉద్యోగోన్నతి

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేనకు ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించింది. సూపర్ టైమ్‌స్కేల్ కమిషనర్ హోదాలో ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాల విద్యాశాఖలోనే కొనసాగించాలని నిర్ణయించింది. ఈ మేరకు సీఎస్ ఉత్తర్వులు ఇచ్చారు.

ప్రజావాణి నోడల్ అధికారిగా హరిచందన

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): మరో ఇద్దరు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ప్రజాభవన్ ప్రజావాణి నోడల్ అధికారిగా హరిచందన దాసరిని నియమించింది. పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ విభాగంలో ప్రభుత్వ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న కే నిర్మలను జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలోని జీపీఎం ఏజెన్సీ వింగ్‌కు బదిలీ చేసింది.

వెయ్యి ఎకరాల్లో కొత్త పారిశ్రామికవాడలు

- ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య ఏర్పాటుకు ప్రభుత్వ యోచన
- బంజరు భూములను గుర్తించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- పారిశ్రామిక అభివృద్ధిపై ఉన్నతాధికారులతో సమీక్ష

పారిశ్రామికాభివృద్ధిపై సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో భట్టి విక్రమార్క

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): నూతన పారిశ్రామిక వాడల ఏర్పాటు కోసం హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)కు, రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్)కు మధ్యలో 500 నుంచి 1000 ఎకరాల మేరకు భూములను గుర్తించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అవి సాగుకు పనికిరాని బంజరు భూములై ఉండటంతోపాటు విమానాశ్రయాలు, జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులకు 50 నుంచి 100 కి.మీ. దూరంలోపు ఉండాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిపై సోమవారం ఆయన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో కలిసి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. నూతన సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. పారిశ్రామిక వికేంద్రీకరణకు ప్రాధాన్యమిస్తున్నట్టు చెప్పారు. పరిశ్రమల ఏర్పాటు కోసం హైదరాబాద్ మినహా 9 ఉమ్మడి జిల్లాల్లో బంజరు భూములను గుర్తించాలని, అవి నివాస ప్రాంతాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో పరిశ్రమలకు కేటాయించిన భూములు, వాటిలో పారిశ్రామిక అవసరాలకు ఉపయోగించని భూములపై పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

బల్క్‌డ్రగ్స్ పరిశ్రలపై విదేశాల్లో అధ్యయనం

రాష్ట్రంలో కాలుష్య రహిత పరిశ్రమలకు ప్రాధాన్యమివ్వాలని అధికారులకు సీఎం రేవంత్ సూచించారు. హైదరాబాద్‌లోని నాచారం, జీడిమెట్ల, కాటేదాన్ తదితర పారిశ్రామికవాడల విషయంలో ప్రత్యామ్నాయాలను సూచించాలని కోరారు. బల్క్‌డ్రగ్స్ తయారీ పరిశ్రమల ఏర్పాటు కోసం మధ్య ప్రాచ్య, యూరప్ దేశాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం చేయాలని తెలిపారు. పరిశ్రమలకు థర్మల్ విద్యుత్తును కాకుండా సోలార్ పవర్‌ను ఉపయోగించేలా చర్యలు చేపట్టాలని, రాష్ట్రంలోని గ్రామాలను మాడల్ గ్రామాలుగా అభివృద్ధి చేసేందుకు తగు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా బాలానగర్‌లోని ఐడీపీఎల్ భూములపై కూడా ఆరా తీసిన సీఎం రేవంత్.. వాటి పరిస్థితిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. సమావేశంలో సీఎస్ శాంతికుమారి, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ కృష్ణ భాస్కర్, సీఎంవో అధికారులు శేషాద్రి, శివధర్‌రెడ్డి, షానవాజ్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

22న ఎల్బీ స్టేడియంలో క్రిస్మస్ వేడుకలు

ప్రతి ఏటా నిర్వహిస్తున్న తరహాలోనే ఈసారి కూడా క్రిస్మస్ వేడుకలను ఈ నెల 22న అధికారికంగా నిర్వహించనున్నారు. ఇం దుకు ఎల్బీ స్టేడియం వేదిక కానున్న ది. వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానుండగా, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ విషయాన్ని క్రిస్టియన్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ కాంతివెస్లీ ఒక ప్ర కటనలో సోమవారం వెల్లడించారు.

ఆ ఖర్చుల భారం మీదే

- ట్రిపుల్ ఆర్ యుటిలిటీస్ షిఫ్టింగ్‌కు కేంద్రం నో!

హైదరాబాద్, డిసెంబర్ 18(నమస్తే తెలంగాణ): రీజినల్ రింగురోడ్డు నిర్మాణంలో అడ్డంగా వచ్చే కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, టెలికం లైన్లు వంటి (యుటిలిటీస్)ను తొలగించేందుకు అయ్యే ఖర్చును రాష్ట్రమే భరించాలని కేంద్రం స్పష్టం చేసింది. ఇటీవల రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన విజ్ఞప్తిని కేంద్రం తిరస్కరించింది. భూసేకరణకు అయ్యే ఖర్చుతోపాటు యుటిలిటీస్ షిఫ్టింగ్‌కు అయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని కేంద్ర ఉపరితల రవాణా శాఖ అధికారులు స్పష్టంచేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం అందించారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు, ఇక్కడి రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకొని కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదించిన రీజినల్ రింగురోడ్డుకు కేంద్ర భారత్‌మాల పరియోజన ఫేజ్-1 కింద ఆమోదం తెలిపింది. సంగారెడ్డి, తూప్రాన్, చౌటుప్పల్, ఆమన్‌గల్, శంకర్‌పల్లి తదితర పట్టణాలగుండా 340 కిలోమీటర్ల పొడవున నాలుగు లేన్లతో దీనిని ప్రతిపాదించారు. భూసేకరణకు సుమారు రూ.5,170 కోట్లకుపైగా ఖర్చవుతుందని అంచనా వేయగా, ఇందులో సగం రూ.2,585 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంది. ఈ మేరకు కేసీఆర్ ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించి, అందులో రూ.100 కోట్లు ఇప్పటికే విడుదల చేసింది. యుటిలిటీస్ షిఫ్టింగ్‌కు రూ. 363 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. రోడ్డు నిర్మాణం జరిగిన తరువాత టోల్‌ట్యాక్స్, పెట్రోల్ సెస్సు రూపంలో కేంద్రం వసూలు చేసుకుంటుంది కాబట్టి యుటిలిటీ షిఫ్టింగ్ భారాన్ని కూడా భరించాలని కేసీఆర్ ప్రభుత్వం కేంద్రానికి పలుమార్లు విజ్ఞప్తిచేసింది. కానీ కేంద్రం స్పందించలేదు.

రాష్ట్రంపై రూ.363 కోట్ల భారం

రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ సర్కారు కొలువుదీరిన తరువాత ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఢిల్లీలో కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరలో పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పనిలోపనిగా యుటిలిటీస్ తరలింపునకు అయ్యే ఖర్చును కూడా కేంద్రం భరించాలని కోరగా, కేంద్రం మరోమారు తిరస్కరించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వంపై రూ. 363 కోట్ల భారం తప్పే అవకాశం లేదు.

బస్‌పాస్ రాయితీలకు 212.5 కోట్లు

- బస్‌పాస్ ఫైల్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ తొలి సంతకం
- సచివాలయంలో బాధ్యతలు స్వీకరించిన రవాణాశాఖ మంత్రి



సోమవారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 2023-24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి బస్‌పాస్‌లకు రాయితీల ఖర్చు రీయింబర్స్‌మెంట్ కోసం రూ.212.50 కోట్లను విడుదల చేసే దస్త్రంపై మంత్రి తొలి సంతకం చేశారు. రవాణాశాఖకు సంబంధించి మూడో త్రైమాసికానికి సంబంధించిన రూ.162.50 కోట్లు విడుదల చేస్తూ మరోక దస్త్రంపై సంతకాలు చేశారు. అదే విధంగా హెడ్ ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్‌కి లక్ష రూపాయలు మెడిక్లెయిమ్ మంజూరు చేస్తూ మూడో ఫైల్‌పై సంతకం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీను అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని పొన్నం తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణానికి మహిళల నుంచి విశేష స్పందన వస్తుందని, ఇదే స్ఫూర్తితో మిగతా గ్యారెంటీలను ప్రాధాన్య క్రమంలో తప్పక అమలు చేస్తామని స్పష్టంచేశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పొన్నం ప్రభాకర్‌కు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి, ముఖ్య కార్యదర్శులు బుర్రా వెంకటేశం, వాణీ ప్రసాద్, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

సంక్రాంతి వరకు 4 గ్యారెంటీలు అమలు

- ఆర్థిక ఇబ్బందులున్నా పథకాలు అమలుచేస్తాం
- పంచాయతీ ఎన్నికలపై నిర్ణయం తీసుకోలేదు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం తాము ప్రకటించిన ఆరు గ్యారంటీలను తమ ప్రభుత్వం కచ్చితంగా అమలు చేస్తుందని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టంచేశారు. ఖమ్మం కలెక్టరేట్‌లో కలెక్టర్ వీపీ గౌతమ్, పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్ వారియర్‌తో కలిసి సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమ పథకాలను ఆటంకం లేకుండా అమలుచేస్తామని తెలిపారు. ఆరు గ్యారెంటీల్లో రెండు గ్యారంటీలను ఇప్పటికే అమలు చేస్తున్నామని, ఈ నెల 28 వరకు మరో రెండు గ్యారెంటీల అమలును ప్రారంభిస్తామని చెప్పారు. సంక్రాంతి వరకు మిగతా రెండు గ్యారెంటీలను కూడా అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని వివరించారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అంశంపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఈనెల 20న అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులు, భూములను ఆక్రమించిన వారిపై, నిధులు కొల్లగొట్టిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తమ సమస్యలను వివరించుకునేందకు అవకాశం కల్పిస్తామని చెప్పారు. ధరణిలో ఉన్న లోపాలను సరిచేయాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. ఇసుక, మట్టి, ఇతర మైనింగ్ మాఫియాపై ఉక్కుపాదం మోపుతామని అన్నారు. ప్రతి పేద కుటుంబానికీ ఇల్లు మంజూరు చేస్తామని తెలిపారు. సంక్రాంతి నాటికి ఇండ్ల స్థలాలు, నూతన రేషన్ కార్డుల మంజూరును కూడా ప్రారంభిస్తామని తెలిపారు.

మల్టి ఇయర్ టారిఫ్‌పై ఈఆర్సీ విచారణ

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): ఎలక్ట్రిసిటీ మల్టి ఇయర్ టారిఫ్ రెగ్యులేషన్ -2023పై తెలంగాణ విద్యుత్తు నియంత్రణ కమిషన్ సోమవారం బహిరంగ విచారణ చేపట్టింది. రెడ్‌హిల్స్‌లోని ఈఆర్సీ కార్యాలయంలో విచారణకు టీఎస్ఈఆర్సీ చైర్మన్ శ్రీరంగారావు, సభ్యులు ఎండీ మనోహర్‌రాజు, బండారు కృష్ణయ్య హాజరయ్యారు. రెగ్యులేషన్స్ డ్రాఫ్ట్‌ను ఇప్పటికే విడుదల చేసిన ఈఆర్సీ దీనిపై విచారణ జరిపింది. ఈ సందర్భంగా డిస్కంలు ఈ రెగ్యులేషన్స్‌పై పలు ప్రతిపాదనలు సమర్పించాయి. సెంటర్ ఫర్ పవర్ స్టడీస్ కన్వీనర్ ఎం వేణుగోపాల్‌రావు, ప్రయాస్ సభ్యుడు ఎన్ శ్రీకుమార్, ఎఫ్‌టీసీసీఐ ప్రతినిధులు ఈ రెగ్యులేషన్స్‌పై తమ అభ్యంతరాలను తెలిపారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ కొనుగోలు ఒప్పందాలు, టారిఫ్ విధానాలు వినియోగదారులపై భారం పడకుండా చూడాలని కోరారు. డిస్కంలు మూడేండ్ల వరకు వార్షిక ఆదాయ అంచనాలను సమర్పించలేదని, ఈ విషయంలో సుమోటాగా చర్యలెందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. ప్రయాస్ సభ్యుడు శ్రీకుమార్ మాట్లాడుతూ టారిఫ్ ప్లాన్ రెగ్యులేషన్స్ చేయడం మంచిదేనని అన్నారు. ఉత్పత్తిలో పోటీతత్వాన్ని పెంచడంతో వినియోగదారులకు లబ్ధి జరిగేలా ఉంటే మంచిదని అన్నారు.

ముందస్తు అడుగులు

- రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల వేడి
- ఇన్‌చార్జీలను ప్రకటించిన కాంగ్రెస్
- బీఆర్ఎస్‌లోనూ సమీక్షలు
- ఓటర్ల జాబితా పూర్తికి ఈసీ కసరత్తు వేగవంతం

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): లోక్‌సభకు నిర్ణీత గడువుకన్నా ముందుగానే ఎన్నికలు వస్తాయన్న ఊహాగానాల నేపథ్యంలో రాష్ట్రంలోని రాజకీయపార్టీలు అందుకు సమాయత్తమవుతున్నాయి. నిర్ణీత గడువుకు నెల ముందే లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ మొదలవుతుందన్న ప్రచారానికి బలం చేకూర్చేలా కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల తుది జాబితాను రూపొందించే పనిని చురుకుగా కొనసాగిస్తున్నది. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి కూడా సోమవారం జరిగిన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ)లో లోక్‌సభ ఎన్నికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలు నిర్ణీత గడవు కన్నా ముందే వస్తాయని సంకేతాలు ఇచ్చారు. దీనికి అనుగుణంగా లోక్‌సభ నియోజకవర్గాల వారీగా పార్టీ ఇన్‌చార్జీలను ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపిక ఆలస్యమైందని, లోక్‌సభ ఎన్నికల్లో జాప్యం చేయకూడదని సూచించినట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందే తాము హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు సంబంధించిన కార్యాచరణపై కాంగ్రెస్ కసరత్తు చేస్తున్నది. ఈ నెల 28 నుంచే ఆరు గ్యారెంటీలను అమలు చేసే దిశగా ఏర్పాట్లు చేస్తున్నది. ఈ నెలలో ప్రారంభించకపోతే జనవరిలో రెండువారాలపాటు మంచి రోజులు ఉండవని, ఆ తర్వాత బడ్జెట్ సమావేశాల కసరత్తు ఉంటుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. డిసెంబర్ ఆఖరుకల్లా గ్యారెంటీల అమలు మొదలుపెట్టకపోతే లోక్‌సభ ఎన్నికల్లో అభాసు పాలయ్యే అవకాశం ఉంటుందని ఆ పార్టీ భావిస్తున్నది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ఫిబ్రవరి రెండోవారంలోపే వస్తుందని, అప్పుడు మే వరకు గ్యారెంటీల అమలు సాధ్యం కాదని భావిస్తున్నారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో అధికార వైసీపీ కూడా ముందస్తు ఎన్నికలు వస్తాయని పార్టీ శ్రేణులకు సంకేతాలు ఇచ్చింది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను కూడా వైసీపీ మొదలుపెట్టింది. టీడీపీ కూడా పాదయాత్రలు, సభల పేరుతో హడావుడి చేస్తున్నది.

ఏప్రిల్ తొలివారంలో పోలింగ్?

లోక్‌సభ ఎన్నికలపై ఊహాగానాలను బీఆర్ఎస్ కూడా నిశితంగా గమనిస్తున్నది. క్షేత్రస్థాయిలో పార్లమెంటు నియోజకవర్గాల వారీగా పార్టీ స్థితిగతులపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సమీక్షలు చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న పార్టీ అధినేత కేసీఆర్ కూడా కొద్దిరోజుల్లోనే సమగ్రంగా చర్చించే అవకాశం ఉన్నది. దేశవ్యాప్తంగా 6-7 విడతల్లో పోలింగ్ జరుగుతుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. తొలిదశలోనే తెలంగాణ ఎన్నికలుంటాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తొలిదశ ఎన్నికలు ఏప్రిల్ పదో తేదీలోపే ఉంటాయని, తెలంగాణలో ఏప్రిల్ తొలివారంలోనే ప్రక్రియ పూర్తవుతుందని భావిస్తున్నారు. మలిదశ పోలింగ్ మే తొలివారం వరకు ఉంటుందని, ఫలితాలు మే 15 లోపే ప్రకటిస్తారని ప్రచారం జరుగుతున్నది.

ఎన్జీటీ మార్గదర్శనంలోనే పదోన్నతులు

- కాలుష్య నియంత్రణ మండలిలో పోస్టుల భర్తీ ప్రక్రియ కూడా..
- రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడి

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) మార్గదర్శకాలను అనుసరించే రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలిలో ఉద్యోగాల నియామలు, పదోన్నతుల ప్రక్రియ చేపడతామని అటవీశాఖ మంత్రి కొండా సురేఖ చెప్పారు. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన కాలుష్య నియంత్రణ మండలి బోర్డు సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత అంశాలపై కాంట్రాక్టర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. నాలా క్లీనింగ్ ప్రభావం అన్ని ప్రధాన మున్సిపల్ కార్పొరేషన్లలో కూడా నిర్ధారించనున్నట్టు తెలిపారు. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాల ప్రచారంలో ఇంటి నుంచి పనిచేసే మహిళా స్వయం సహాయక బృందాల ప్రమేయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. పరిశ్రమల తరలింపు తప్పనిసరి అయితే అనువైన భూములను గుర్తించాలని ఆదేశించారు. తొలుత బోర్డు అధికారులు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌తోపాటు వాయు, నీటి కాలుష్యానికి సంబంధించిన పర్యావరణ నాణ్యత పర్యవేక్షణ, పర్యావరణ సమ్మతిని నియంత్రించడం వంటి అంశాలతోసహా బోర్డు పనితీరుపై ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి ఎండీ, సభ్య కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ వల్లే కాంగ్రెస్ గెలుపు

- మిగతా మూడు రాష్ట్రాల్లో పొత్తు లేకపోవడం వల్లే నష్టం
- సీపీఐ నేత డాక్టర్ కే నారాయణ

హైదరాబాద్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): సీపీఐతో పొత్తు పెట్టుకోవడం వల్లే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ పేర్కొన్నారు. కొన్నిచోట్ల కాంగ్రెస్ అభ్యర్థుల మెజారిటీకి సీపీఐ ఓట్లు ఉపయోగపడ్డాయని చెప్పారు. కమ్యూనిస్టులతో పొత్తు లేకపోవడం వల్లే మిగతా మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓడిపోయిందని, దీన్ని జాతీయ నాయకత్వం గుణపాఠంగా తీసుకోవాలని సూచించారు. సోమవారం మగ్ధూంభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో ఒంటెద్దు పోకడల వల్లే కా